క్లుప్తంగా

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంతకల్లు: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాల డైరెక్టర్ గోపాల్ సూచించారు. ఈ నెల 19 నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అనంతపురం జేఎన్‌టీయూ కళాశాలలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ పోటీల్లో సాంస్కృతిక (నృత్య)విభాగంలో కళాశాల విద్యార్థులు తృతీయ స్థానంలో సాధించడంతో బుధవారం వారిని అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచండి



డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ నయీమ్ అహ్మద్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మున్సిపల్ స్కూళ్ల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ శానిటేషన్ సిబ్బందికి సూచించారు. బుధవారం పట్టణంలోని 37వ వార్డులో పర్యటించిన ఆయన డిపెప్ స్కూల్ పరిసరాల్లో నిండిపోయిన డ్రైనేజీలను పరిశీలించి వెంటనే క్లియర్ చేయించాలని శానిటరీ సెక్రటరీలను ఆదేశించారు. అనంతరం ఆయన పట్టణంలో ట్యాక్స్ కలెక్షన్స్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొని బకాయిదారుల నుంచి పన్నులు వసూలు చేశారు.

23న గుండె వైద్య శిబిరం

గుంతకల్లుటౌన్: గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని 11వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ యువనాయకుడు అబ్దుల్‌బాసిద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 60 అడుగుల రోడ్డులోని అయ్యప్పస్వామి స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యులు బీఆర్‌బీఎస్, ఈసీజీ, 2డీ ఎకో తదితర వైద్యపరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



గుత్తిలో నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

గుత్తి: కర్నూలు నుంచి లోకాయుక్తా కార్యాలయం, హ్యూమన్ రైట్స్ కార్యాలయం తరలింపును వ్యతిరేకిస్తూ కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీడీ రత్నం, సీనియర్ న్యాయవాదులు చంద్రకాంత్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్, శ్రీనివాసులు, నూర్ మహమ్మద్ తదితరులు బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీడీ రత్నం మాట్లాడుతూ ప్రభుత్వం కర్నూలు నుంచి లోకాయుక్తా కార్యాలయం, హ్యూమన్ రైట్స్ కార్యాలయాన్ని తరలించడం ఆపాలన్నారు. అలాగే కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పై డిమాండ్ల సాధన కోసం మూడు రోజుల పాటు విధుల బహిష్కరణ చేపట్టనున్నట్లు వారు ప్రకటించారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం



రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

పామిడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులను బుధవారం ఎంపీడీఓ కే తేజోత్స్న ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పాతజాబ్ కార్డు ఉన్నవారు వాటిని యాక్టివ్ చేసుకోవాలని, లేని వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ డీ గౌసేపీరా, మాజీ కౌన్సిలర్ చెన్నవరం మహబూబ్‌బాషా, మాజీ ఎంపీటీసీ జింకల సంజీవకుమార్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం.. తీస్తోంది ప్రాణం!

బండల ట్రాక్టర్ డ్రైవర్ల ఇష్టారాజ్యం

- అతివేగం, అధిక టన్నేజీతో బండల రవాణా
- రికార్డులు సక్రమంగా లేని వాహనాలే అధికం
- తాడిపత్రి - బుగ్గ రోడ్డుపై తరచూ రోడ్డు ప్రమాదాలు
- భయాందోళనలో వాహనదారులు



ఓవర్‌లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లు

తాడిపత్రి రూరల్: బండల ట్రాక్టర్ల డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలను తీస్తోంది. అతివేగం, ఎక్కువ టన్నేజీతో నియంత్రణ కోల్పోతున్న ట్రాక్టర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ ప్రమాదాల్లో ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు మృతి చెందడమో, క్షతగాత్రులు కావడం సర్వసాధారణంగా మారింది. దీంతో తాడిపత్రి-బుగ్గ రోడ్డు అంటేనే వాహన చోదకులు భయపడుతున్నారు. డ్రైవింగ్‌పై అవగాహన లేకుండా ఓవర్ లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లను నడపడం వల్ల ప్రమాదాల శాతం పెరుగుతోంది. అనంతపురం- నంద్యాల జిల్లాలను కలిపే ప్రధాన రహదారి కావడంతో ఎక్కువ సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో అల్ట్రాటెక్, పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీలతో పాటు గ్రానైట్, కడప స్లాబ్ యూనిట్లలో పని చేయడానికి వేలాది మంది ద్విచక్ర వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారిపై హద్దుమీరిన వేగంతో వస్తున్న బండల ట్రాక్టర్లు వాహన చోదకులను భయకంపితులను చేస్తున్నాయి.

నంద్యాల జిల్లాలో బండల గనులు

తాడిపత్రి మండలానికి సరిహద్దుగా ఉన్న నంద్యాల జిల్లాలో అధిక సంఖ్యలో బండల గనులు విస్తరించాయి. నంద్యాల జిల్లాలోని రామాపురం, అంకిరెడ్డిపల్లి, గొర్విమానిపల్లి, కనకాద్రిపల్లి తదితర గ్రామాల పరిధిలో బండల గనులు ఎక్కువగా ఉన్నాయి. తాడిపత్రి, శింగనమలతోపాటు సరిహద్దు జిల్లా అయిన కడప జిల్లాకు కూడా ఈ గనుల నుంచే ట్రాక్టర్ల ద్వారా బండలను సరఫరా చేస్తారు. తాడిపత్రి ప్రాంతంలోని కడప స్లాబ్ యూనిట్లకు ట్రాక్టర్ల ద్వారా బండలను రవాణా చేస్తున్నారు. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా బండలను తరలిస్తుంటారు.

మీనమేషాలు లెక్కిస్తున్న ఆర్టీఓ అధికారులు

అధిక లోడ్‌తో బండలను తీసుకెళుతున్న ట్రాక్టర్లపై దాడులు చేయడంలో ఆర్టీఓ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. తరచుగా దాడులు జరపడం వల్ల కొంత వరకు నియంత్రించడానికి వీలుందని తెలిసిన అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల ఉదాశీనత కారణంగా అధిక లోడ్ తోపాటు ఓవర్‌స్పీడ్‌తో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలన్న ఆలోచన కూడా చాలా మందికి అనిపించడం లేదు. బండల లోడ్‌తో వెళుతున్న అనేక ట్రాక్టర్లకు సరైన రికార్డులు కూడా ఉండటం లేదు. ఇన్సూరెన్స్‌లు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగినపుడు బాధితులకు నష్టరిహారాన్ని కోల్పోవాల్సి వస్తోంది. చివరికి పెద్దమనుషులు, పోలీసుల ద్వారా పంచాయితీలతో వచ్చిన మొత్తాలను సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

స్పీకర్ల సౌండ్‌తో వినిపించని వెనుక వాహనాల హారన్

అసలే ఓవర్‌లోడ్, అపై మితిమీరిన వేగం అంతకు మించి స్పీకర్ల సౌండ్‌తో ట్రాక్టర్లలో సినిమా పాటలు వింటూ డ్రైవర్ల నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా ఎంతో మంది మృత్యువాత పడుతున్నారు. పెద్ద సౌండ్‌తో స్పీకర్లలో పాటలు వింటూ ఉండటంతో వెనుక నుంచి వచ్చే వాహనాల హారన్ ట్రాక్టర్ డ్రైవర్లకు వినిపించడం లేదు. హారన్ సౌండ్ విన్నాడన్న ఆలోచనతో వెనక వాహనాలు ఓవర్‌టేక్ చేయబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదం అని తెలిసినా ట్రాక్టర్ డ్రైవర్‌కు ఇరువైపు కూలీలు కూర్చొంటూ కుదుపులకు అదుపుతప్పి కింద పడి మృతి వాత పడ్డ వారితో పాటు క్షతగాత్రులైన వారు ఎందరో ఉన్నారు.

జరిమానా విధిస్తున్నాం



ఓవర్‌లోడ్‌తో వెళుతున్న బండల ట్రాక్టర్లకు జరిమానా విధిస్తున్నాం. వాహనాల తనిఖీల పేరుతో రికార్డులను పరిశీలించి వాటిని అదుపులోకి తీసుకుంటున్నాం. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని డ్రైవర్లపై మొదట జరిమానాలు విధిస్తాం. ఆ తర్వాత కేసులు నమోదు చేస్తాం. ట్రాక్టర్లకు అన్ని రకాల రికార్డులు, ఇన్స్‌రెన్స్ లేకుంటే సీజ్ చేయడానికి కూడా వెనుకాడం. –శివగంగాధర్‌రెడ్డి, అప్‌గ్రేడ్ సీఐ

బైక్‌పై వెళ్లాలంటే భయం



బండల ట్రాక్టర్లకు ఎదురుగా కానీ, పక్కన వెళ్లాలంటే భయంగా ఉంటోంది. ఎటువైపు స్టీరింగ్ తిప్పుతాడో తెలియక భయపడుతూ వాహనాన్ని నడుతూ వెళుతుంటాను. వేగంగా నడపడం వల్ల బ్రేకులు సరిగా పడక ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

– శ్రీధర్, తాడిపత్రి

అతివేగం ప్రమాదకరం



కడప రోడ్డు వైపు కూడా బండల ట్రాక్టర్లు వెళుతుంటాయి. స్పీడ్ బ్రేకర్లు ఉన్నప్పుడు వేగంగా వెళ్లడం వల్ల బండల ట్రాక్టర్ల ఇంజినట్లు రెండు అడుగుల పైకి లేస్తుంటాయి. ఇలాంటి సమయంలో స్టీరింగ్ అదుపుతప్పితే ఇంక అంతే సంగతులు. జనసంచారంలో సైతం డ్రైవర్లు వేగాన్ని తగ్గించకుండా వెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

– ప్రతాప్, తాడిపత్రి

వైవీఆర్‌కు మాజీ సీఎం జగన్ పరామర్శ



మాజీ సీఎం జగన్‌తో వీడియో కాల్‌లో మాట్లాడుతున్న వైవీఆర్

గుంతకల్లు: గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి(వైవీఆర్)ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో సర్వైకల్ ఆపరేషన్ చేయించుకున్న వైవీఆర్‌ను బుధవారం మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాల్ ద్వారా యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ సక్సెస్ అయిందని, 15 రోజులు పాటు రెస్ట్ తీసుకుంటే సరిపోతుందని వైవీఆర్ వివరించారు. తొందరలోనే నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



వివరాలను తెలుసుకుంటున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఓబులు

బుక్కరాయసముద్రం: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఓబులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ముందుగా పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఓబులు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. ఇందులో అలసత్వం వహించరాదన్నారు. అనంతరం గౌరయ్య కాలనీలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి తల్లి పిల్లలకు వ్యాధి నిరోధక టీకా తప్పనిసరిగా వేయించాలన్నారు. అనంతరం కాలనీలో పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సీహెచ్‌ఓ మోహన్‌రావు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, సిబ్బంది నూర్‌బాషా, శ్రీధర్ మూర్తి, చెన్నమ్మ, సత్యనారాయణశాస్త్రి, ఆనంద్, అంజినమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని కొండ కింద వీధిలో నివాసం ఉంటున్న లింగం లక్ష్మిదేవి(70) అనారోగ్యంతో బుధవారం మృతి చెందినది. మృతురాలికి లింగం ఓబులదాసు ఒక్కడే కుమారుడు. అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ రాకపోవడంతో అతడు యాడికి మే ఐ హెల్ప్‌యూ వారిని సంప్రదించాడు. దీంతో ఫౌండేషన్ సభ్యులు హిందూ సంప్రదాయం పద్ధతిలో లింగం లక్ష్మిదేవి అంత్యక్రియలను నిర్వహించారు. ఫౌండేషన్ సభ్యులు బాలకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, ధృవనారాయణ, నరసింహ, శంకరప్ప, రామమోహన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



కరపత్రాలు విడుదల చేస్తున్న రైతు సంఘం నేతలు

బుక్కరాయసముద్రం: రైతు సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివారెడ్డి విమర్శించారు. రైతు, కార్మిక సమస్యలపై ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగం పట్ల నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. పెట్టుబడి సాయం కింద రూ.20 వేల చొప్పున రైతుల అకౌంట్లలోకి వేస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు నాయుడు పైసా సాయం అందించలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయన్నారు. నిత్యావసరాల ధరలు పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు నారాయణస్వామి, హనుమంతరెడ్డి, నాగేంద్ర, ఆది నారాయణ, శ్రీరాములు సీపీఎం తదితరులు పాల్గొన్నారు.

గుత్తి సీఐకి ఎస్పీ ప్రశంస



ఎస్పీ జగదీష్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న సీఐ వెంకటేశ్వర్లు

గుత్తి: అనంతపురంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో గుత్తి సీఐ వెంకటేశ్వర్లు ఎస్పీ జగదీష్ చేతుల మీదగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. విధుల్లో అత్యంత ప్రతిభ కనబరిచినందుకు సీఐ వెంకటేశ్వర్లుకు ఎస్పీ ప్రశంసా పత్రాన్ని ప్రదానం చేశారు. సీఐ వెంకటేశ్వర్లు జూదాల నిర్మూలనకు చర్యలు తీసుకోవడంతో పాటు మహిళలను వేధిస్తున్న పోకిరీలను అరెస్టు చేయడం, ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువతీ యువకులను మోసం చేసిన చీటర్లను అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించారు.

వాహనం ఢీకొని జింక మృతి



పెద్దవడుగూరు: గుర్తుతెలియని వాహనం ఢీ కొన్న ఘటనలో ఓ కృష్ణ జింక మృతి చెందింది. పెద్దవడుగూరు మండలం కొట్టాలపల్లి సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. బుధవారం సాయంత్రం కొట్టాలపల్లి వైపు ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు వెళ్లిందని, అప్పుడే ప్రమాదం జరిగి ఉంటుందనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేశారు. ఘటనపై అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు.

బాలిక అదృశ్యం

గుత్తి రూరల్: మండలంలోని టి.కొత్తపల్లి గ్రామ శివారులో బొగ్గులబట్టీలో పని చేసే సుబ్బమ్మ, శీను దంపతుల కుమార్తె వరలక్ష్మి(16) అనే బాలిక అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు జిల్లా ఉరికుంట్లపాడు మండలం గొల్లపల్లికి చెందిన సుబ్బమ్మ, శీను దంపతులు టి.కొత్తపల్లి గ్రామ శివారులోని బొగ్గలబట్టీలో కూలీ పనులు చేస్తూ గత కొంత కాలంగా అక్కడే ఉంటున్నారు. అయితే వారి చిన్న కుమార్తె రెండురోజుల క్రితం బహిర్భూమికి వెళ్లివస్తానని ఉదయం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వారు చుట్టు పక్కల ప్రాంతాలతో పాటుగా బంధువులు, తెలిసిన వారి వద్ద గాలించారు. అయితే బాలిక ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి: మండల కేంద్రంలోని కోన రహదారిలో పేకాట స్థావరంపై దాడి చేసి 10 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ10,600 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పంట రుణం పొందని రైతులు బీమా చేయించుకోండి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో రబీలో పంట రుణం పొందని రైతులు పంటల బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఏఓ మాట్లాడుతూ రబీలో పంట రుణం పొందిన రైతులకు బ్యాంకు నుంచి ప్రీమియం చెల్లించబడుతుందన్నారు. బ్యాంకులో పంట రుణం పొందని రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్సు కాపీలు, పంట వేసిన ధ్రువీకరణ పత్రం రైతు సేవా కేంద్రం నుంచి తీసుకొని డిసెంబర్ 15 లోపల మీ సేవలో పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వల్ల పంట నష్టం జరిగితే పంట నష్ట పరిహారం పొందవచ్చన్నారు.

బేల్దారి ఆత్మహత్య

గుంతకల్లు: స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన బేల్దారి శ్రీనివాసులు (46) అనే వ్యక్తి బుధవారం సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ తెలిపిన వివరాలు. బేల్దార్ పని చేసుకుంటు జీవిస్తున్న శ్రీనివాసులుకు భార్య కమలతోపాటు ఇద్దరు పిల్లలున్నారు. గతేడాది కుమార్తెకు వివాహం చేశాడు. అయితే ఏమయిందో తెలియదు కానీ బుధవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



గుత్తిలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం



బీకేఎస్‌లో విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న దృశ్యం



పెద్దపప్పూరులో విద్యార్థినికి బహుమతి అందిస్తున్న గ్రంథాలయాధికారి శంకర్

గుత్తి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయాధికారి రామాంజనేయులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు రిటైర్డ్ గ్రంథాలయాధికారి ఏపీ సుబ్బన్న, సామాజిక కార్యకర్త సలీం బహుమతులు ప్రదానం చేశారు.

బుక్కరాయసముద్రం: గ్రంథాలయాలు విజ్ఞానానికి ఉత్తమ వేదికలని ప్రిన్సిపాల్ అర్జున్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని లైబ్రరీలో గ్రంథాలయ వారోత్సవాలను ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రిటైర్డ్ టీచర్ శ్రీరామరత్నం, రిటైర్డ్ గ్రంథాలయ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని గ్రంథాలయంలో వారం రోజులుగా జరుగుతున్న గ్రంథాలయ జాతీయ వారోత్సవాలు బుధవారం ముగిసాయి. ఈ సందర్భంగా ఎంఈఓ నాగరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: స్థానిక గ్రంథాలయంలో బుధవారం వ్యాచరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గ్రంథాలయాధికారి బొల్లి శంకర్ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుడూ గ్రంథాలయంలో అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

యాడికి: స్థానిక గ్రంథాలయంలో బుధవారం వ్యాచరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి బహుమతులు అందజేశారు. కొత్తరాయుడు, శివయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక గ్రంథాలయంలో వారం రోజులుగా గ్రంథాలయాధికారి సీ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిసాయి. చి ఎంఈఓ-2 సత్యనారాయణ, టీసీ హైస్కూల్ హెచ్‌ఎం రామ్‌కుమార్ వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు నాయుడు, రాజేష్, అనూరాధ పాల్గొన్నారు.

గార్లదిన్నె: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఈఓఆర్డీ దామోదరమ్మ పేర్కొన్నారు. బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఓఆర్డీ వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శింగనమల: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన , డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.. గ్రంథాలయాధికారి కృష్ణ, పీడీ నందకుమార్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో బుధవారం జరిగిన కారను లారీ ఢీకొన్న ఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పింది. అనంతపురం నుంచి గుంతకల్లు వైపు వెళుతున్న కారును వెనుక నుంచి లారీ ఢీ కొనింది. అయితే ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

దేవదాయ శాఖ ఈఓపై అర్చకుల దాడి

శింగనమల: అర్చకత్వంపై విచారణకు వచ్చిన దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌పై అర్చకుల గుంపు దాడి చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... శింగనమల మండలం శివపురం శివారున జాతీయ రహదారి పక్కనే ఉన్న పెద్దమ్మ ఆలయం దేవదాయ శాఖ పరిధిలోకి వెళ్లిన తర్వాత అర్చకులకు, ఎండోమెంట్ అధికారుల మధ్య కొంత కాలంగా వివాదం కొనసాగుతూ వస్తోంది. ఈ క్రమంలోనే అర్చకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే అర్చకత్వంలో తమ కుటుంబానికి హక్కు ఉందని ఇటీవల దేవదాయ శాఖ అధికారులకు వి.పెద్దన్న, వి.దాసన్న, వి.వెంకట్రాముడు అనే వ్యక్తులు విన్నవించారు. దీనిపై దేవదాయా శాఖ సిబ్బంది గుర్రప్పతో కలసి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శోభ బుధవారం ఆలయం వద్దకు చేరుకున్నారు. అర్చకత్వం కోసం దరఖాస్తు చేసుకున్నవారూ అదే సమయంలో అక్కడకు చేరుకోవడంతో ప్రస్తుత అర్చకులు రామలక్ష్మి, అంబిక, వెంకట్రాముడు, జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి తెరలేపారు. ఆ సమయంలో అర్చకులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడులు చేసుకున్నారు. అక్కడే ఉన్న ఆలయ ఈఓ శోభపై కూడా దాడి చేయడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.